క్లుప్తంగా

హజ్ యాత్రకు ఎంపిక



భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లేందుకు ఖదీర్ అహ్మద్–గౌసియా బేగం, హనీఫ్–అమీన బేగం ఎంపికైనట్లు తెలంగాణ హజ్ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సర్వర్ మోహియోద్దీన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ఎంపిక పత్రాలను, మార్గదర్శక పుస్తకాలను అందించి, సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు



పలిమెల: పలిమెల మండలం ముకునూరు వద్ద తోగు వాగుకు వరదనీరు పోటెత్తింది. దీంతో భూపాలపల్లి నుంచి పలిమెల మండలం మీదుగా కన్నాయిగూడెం, ఏటూరునాగారం వెళ్లే రెండు బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. పండుగ సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై హై లెవెల్ వంతెన లేకపోవడంతో తరుచూ రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

డప్పుల బహూకరణ



ములుగు రూరల్ : మండలంలోని కాశిందేవిపేటలో కళాకారులకు డప్పులు బహూకరించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా 15 మంది కళాకారులకు డప్పులు అందించారు. నాయకులు ఎండీ అహ్మద్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, అజ్జు, కళాకారులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలు



మంగపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, దివంగత నేత నల్లెల కుమారస్వామి జయంతిని మండలంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. జిల్లా, నియోజక వర్గ, మండల సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిశీలన



ఏటూరునాగారం : మండలంలోని బతుకమ్మ నిమజ్జనం చేసే ప్రాంతాలను స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, నరేష్ పరిశీలించారు. గోదావరి, జంపన్నవాగు ఉప్పొంగడంతో నిమజ్జనం చేసే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎవరూ కూడా వాగులు, గోదావరి, చెరువుల్లో దిగవద్దని, బతుకమ్మ నిర్వాహకులు, మహిళలతోపాటు పురుషులు కూడా అందుబాటులో ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. రొయ్యూర్, శంకరాజుపల్లి, క్రాస్‌రోడ్డులోని చెరువులను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే పోలీసులు అన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. సమస్య ఉంటే డయల్ -100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్టేట్ బెస్ట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు అందజేత

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కందగట్ల గణేశ్‌ను జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ హైదరాబాద్ వారు స్టేట్ బెస్ట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డును సోమవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ లో మైగేట్ సీఈఓ అనీష్ ఆంటోని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పని చేస్తున్నానని, మూడు దశాబ్దాలు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు నేర్పాలని, సబ్జెక్టును ప్రేమతో విద్యార్థులకు బోధిస్తే విద్యార్థులు కూడా అంతే ప్రేమతో నేర్చుకుంటారని అన్నారు.

మొగుళ్లపల్లి: బతుకమ్మలతో వస్తున్న మహిళలు



కాటారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మల్హర్: తాడిచర్ల చీటిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రేగొండలో భారీ బతుకమ్మ



సంబురంగా సద్దుల బతుకమ్మ

మొగుళ్లపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే గునుగు, తంగేడు, గుమ్మడి పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేశారు. యువతులు, మహిళలు వాగు, చెరువుల వద్దకు వెళ్లి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

మల్హర్ : మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆడబిడ్డలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఆటస్థలం వద్దకు తీసుకొచ్చి ఆడిపాడారు. అనంతరం చెరువుకులు, కుంటలో నిమజ్జనం చేశారు. పోయిరా బతుకమ్మ పోయిరావమ్మ అంటూ వేడుకున్నారు. అమ్మవారి నైవేద్యం సత్తుపిండిని ఒకరికొకరు పంచుకున్నారు.

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కాటారం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు అందమైన బతుమ్మలను పేర్చి ఆడిపాడారు.



కాళేశ్వరాలయం ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నాగుర్లపల్లిలో బతుకమ్మతో యువతులు



భూపాలపల్లి రూరల్ : గుర్రంపేటలో ఆడుతున్న మహిళలు



టేకుమట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మొగుళ్లపల్లి: పిడిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





మొగుళ్లపల్లి: బతుకమ్మలతో స్థానికులు, చిన్నారి



కొత్తపల్లిగోరిలో...



రేగొండలో..





బతుకమ్మలను ఆట స్థలానికి తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు, యువతులు



మల్హర్: బతుకమ్మతో మహిళలు





బతుకమ్మతో చిన్నారి, యువతులు



గౌరమ్మతో బతుకమ్మ



కాళేశ్వరం: త్రివేణి సంగమంలో..



టేకుమట్లలో..



టేకుమట్ల: బతుకమ్మతో..



మహదేవపూర్‌లో..

కమ్యూనిటీహాల్ మంజూరు చేయండి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గంగపుత్రులు, మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మహదేవపూర్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు వినతిపత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో వినతిప్రతం జేయగా శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు తూనూరి సంతోష్, గంప మహేష్, నిట్టూరి నగేష్‌లు ఉన్నారు.



శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న రాజబాబు

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె) : వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భాస్కర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైన జ్వరంతో బాధ పడుతున్నారా అని అడిగి తెలుసుకుని సర్వే నిర్వహించారు. హెచ్ఓ కోటిరెడ్డి మోహన్, ధనలక్ష్మి ఉన్నారు.

ఆధునిక హంగులతో బస్‌స్టేషన్

రేగొండ: మండల కేంద్రంలో రూ.3.70 కోట్లతో ఆధునిక హంగులతో నూతన బస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం బస్టాండ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల రవాణా సౌకర్యార్థం నూతన బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

సరస్వతి అలంకరణలో దుర్గాదేవి

మొగుళ్లపల్లి : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకరంతో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత సోమవారం ఎనిమిదో రోజు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాలుసాని బాపురావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు, అన్నారెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా రామాలయం కమిటీ ద్వారా అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామాలయం భవాని మాలధారులు పాల్గొన్నారు. అలాగే స్టార్ యూత్, సాయిబాబా క్రాస్‌రోడ్డు, ముత్యాలమ్మ, శివాలయంలో మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

హత్యాయత్నం కేసులో ఒకరి రిమాండ్

కాటారం: మండల కేంద్రానికి చెందిన జోడు శ్రీనివాస్‌ను హత్యాయత్నం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన జోడు శ్రీనివాస్, కొండపర్తి రమేశ్ కొన్ని రోజుల క్రితం కాటారం గ్రామంలో జరిగిన ఓ వివాహ రిసెప్షన్ వేడుకలో మారగోని స్వామిని దుర్భాషలాడడంతో పాటు దాడి చేసి బండరాయితో తలపై కొట్టే ప్రయత్నం చేశారు. స్వామి తప్పించుకోగా తిరిగి గొంతు పిసికి చంపడానికి ప్రయత్నించారు. అక్కడ ఉన్నవారు అడ్డుకోవడంతో నిందితులు తప్పించుకొని పారిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జోడు శ్రీనివాస్‌ను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కొంతమంది అక్రమ అరెస్టుగా చిత్రీకరిస్తున్నారని నిందితుడిపై గతంలో పలు కేసులు ఉన్నాయని ఎస్సై పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ సోమవారం కాటారం పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. జోడు శ్రీనివాస్ సతీమణి రమ్య మాట్లాడుతూ అర్ధరాత్రి పోలీసులు తమ ఇంట్లో సోదాలు నిర్వహించి ఇబ్బందులకు గురి చేశారని తన భర్త శ్రీనివాస్‌ను తీవ్రంగా కొట్టి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు పనిచేస్తున్నారన్నారు. ఆందోళన చేసిన వారిలో బీఆర్ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, మార్క రాముగౌడ్, జక్కు శ్రావణ్, శ్రీలక్ష్మిచౌదరి, వెంకటస్వామి పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అందని బీమా.. రైతుల ఆవేదన



నీట మునిగిన పంట వరి పంట (ఫైల్)



మిర్చి నారుమడులు (ఫైల్)

- వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం
- పీఎంఎఫ్‌బీవై ప్రీమియం చెల్లింపులు నిలిపివేసిన ప్రభుత్వాలు

వెంకటాపురం(కె) : భారీ వర్షాలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సాగుచేసిన పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు పరిహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని ప్రారంభించింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం.. మిగితాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పంటలు నష్టపోయిన రైతులు పరిహారం పొందేవారు.

నిలిచిన పథకం..

పీఎంఎఫ్‌బీవై కింద పంటసాగు ప్రారంభంలో బీమా చేస్తే నష్టం వాటిల్లినప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేసి బాధితులకు బీమా అందేలా చేసేవారు. ఐదేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించక పోవడంతో పథకం నిలిచిపోయింది.

మండలంలో ఇలా..

మండలంలో వర్షాకాలం సీజన్‌లో ఎక్కువగా వరి పంటను రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరిపొలాల్లో కొంత మేర కొట్టుకుపోవటంతో పాటు పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. బీమా పథకం అమలులో ఉంటే నష్టపోయిన పంటలకు కొంతమేరకు నష్ట పరిహారం అందేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫసల్ బీమా పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పీఎంఎఫ్‌బీవై అమలుచేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్‌బీవై పథకాన్ని నిలిపి వేయడంతో భారీ వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లినా సమయంలో సాయం అందడం లేదు. పీఎంఎఫ్‌బీవై పథకాన్ని తిరిగి అమలు చేసి రైతులకు నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలి.

– కొప్పుల కృష్ణ, రైతు

పథకం అమలు కావడం లేదు



ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. కాగా కేంద్రం నుంచి ఈ పథకం అమలు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతుల వివరాలు పంపించాలని ఆదేశాలు ఇస్తుంది. వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నాం. పథకం నిలిపి వేయడంతో రైతులు నష్టపోతున్నారు.

– నవీన్, ఏఓ

భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యం

వెంకటాపురం(కె) : భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే సంఘ్ లక్ష్యమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వరంగల్ విభాగ్ ప్రచార ప్రముఖ్ మిట్టపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్లుగా సంఘం చేసిన తపస్సు కారణంగానే సమజంలో సత్ఫలితాలు చూడగలుగుతున్నామని తెలిపారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే యావత్ ప్రజలు పంచ పరివర్తన్‌గా పిలువబడే ఐదు అంశాలను తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పొనగంటి శ్రీరామచంద్ర మూర్తి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎస్ఎస్‌తాడ్వాయి : లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాటిందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ సకాలంలో అందించేందుకు మంత్రి సీతక్క కృషి చేస్తోందన్నారు. గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్, పీఏసీఎస్ డైరెక్టర్ సిద్దిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, అనుమాండ్ల రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.